సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం, 17, మే, 2024



పూర్వ వైభవం వస్తుంది

బీఆర్‌ఎస్‌ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. - 8లో



అసంపూర్తిగా 'మన బడి'

మన బస్తీ- మనబడిలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. - 9లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం $37^0 / 25^0$

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఇల్లు.. ఎప్పుడిస్తరు!

పూర్తయిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో కాలయాపన

- ఎనిమిది నెలల క్రితమే డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- పొజిషన్‌ చూపని అధికారులు
- పంపిణీ చేసిన గృహాల్లో వసతుల లేమి
- ఉండలేకపోతున్న కుటుంబాలు

సాక్షి,యాదాద్రి : పేదలకు సొంతిల్లు కలగానే మిగిలింది. జిల్లాలో పలు చోట్ల నిర్మాణాలు పూర్తయిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను.. లబ్ధిదారులకు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారు. మరో వైపు పంపిణీ చేసిన ఇళ్లలో వసతులు లేకపోవడంతో చాలా కుటుంబాలు గృహప్రవేశం చేయడం లేదు.

◆ పేదల సొంతింటి కల నెరవేర్చడానికి గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం డబుల్‌ బెడ్‌ ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భువనగిరి పట్టణానికి 850 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో సింగన్నగూడెం వద్ద 444 ఇళ్లు నిర్మించారు. ఇవన్నీ నిర్మాణం పూర్తి కావడంతో గత ఏడాది అక్టోబర్‌లో డ్రా ద్వారా 419 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ, ఇప్పటి వరకు కేటాయించలేదు. దీంతో లబ్ధిదారులు ఇటీవల ఇళ్ల వద్ద ఆందోళనకు దిగారు. మిగతా ఇళ్లలో హుస్నాబాద్‌ వద్ద 116 ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఇవి నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే వడపర్తి, పగిడిపల్లి, అనంతారంతో పాటు మరికొన్ని గ్రామాల్లో 310 ఇళ్లు మంజూరు కాగా నేటికీ పనులు మొదలుకాలేదు.



భువనగిరిలోని సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు

◆ వలిగొండ మండలంలోని వెల్వర్తి, నాగారం, అరూర్‌ గ్రామాలకు 80 ఇళ్లు మంజూరయ్యాయి. టెండర్లు వేసినా ఎవ్వరూ ముందుకు రాలేదు.

◆ బీబీనగర్‌ మండలం కొండమడుగులో 30 ఇళ్లకు 30, బీబీనగర్‌లో 30 ఇళ్లకు 11 పూర్తయ్యాయి. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

◆ భూదాన్‌పోచంపల్లికి 120, జిబ్లక్‌పల్లికి 36, దేశముఖ్‌ గ్రామానికి 30 గృహాలు మంజూరయ్యాయి. ఇందులో భూదాన్‌పోచంపల్లిలో 60, జిబ్లక్‌పల్లిలో 36 పూర్తయ్యాయి. పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసినా కేటాయించలేదు. ఇక దేశముఖ్‌లో పనులే మొదలుకాలేదు.

◆ చౌటుప్పల్‌ పట్టణానికి 150, దండుమల్కాపురం గ్రామానికి 70 ఇళ్లు మంజూరయ్యాయి. దండుమల్కాపురంలో పూర్తి కావడంతో 69 మందికి పట్టాలు పంపిణీ చేశారు. వారంతా గృహ ప్రవేశం చేశారు.

◆ సంస్థాన్‌ నారాయణపురం మండల కేంద్రానికి 60, సర్వేల్‌కు 64 ఇళ్లు మంజూరయ్యాయి. సర్వేల్‌ లో నిర్మాణాలు పూర్తి కావడంతో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారంతా ఇళ్లలో నివాసం ఉంటున్నారు. సంస్థాన్‌నారాయణపురంలో బేస్మెంట్‌ దశలో పనులను వదిలేశారు.

◆ ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో 50, ఉప్పలపహాడ్‌లో 45 ఇళ్లు నిర్మించారు. రెండు చోట్ల లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. అయితే అక్కడ మౌలిక వసతులు కల్పించపోవడంతో చాలా మంది ఇళ్లలోకి రాలేదు.

◆ మోటకొండూర్‌ మండలం ఆరెగూడెం శివారులో 40 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కానీ, ప్రస్తుతం 18 నుంచి 20 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. ఇళ్లు ఊరికి దూరంగా ఉండడం, రవాణా సౌకర్యం లేకపోవడం తదితర కారణాలతో మిగతా వారు ఇళ్లలోకి రావడం లేదు.

◆ ఆలేరు పట్టణంలో 64, కొలనుపాకలో 64 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించారు. కానీ, డ్రెయినేజీ సమస్య ఉండడంతో కొన్ని కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి.

◆ యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో ఇళ్ల నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయలేదు.



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో నిర్మించిన డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల మధ్య రోడ్డు వేయని దృశ్యం



ఆలేరు : డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్య నుంచి పారుతున్న మురుగు నీరు

ఊరికి దూరంగా నిర్మించారు



డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను ఊరికి దూరంగా నిర్మించారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఉంది. అంతేకాకుండా రోడ్లు, డ్రెయినేజీ తదితర వసతులు లేవు.వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారి నడవలేకుండా ఉంటుంది. మౌలిక వసతులు కల్పించాలి.

–గట్టిగప్పుల శ్రీధర్‌, మోటకొండూర్‌

వసతులు లేవు



డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లలో సరైన వసతులు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇళ్లలోని మురుగు నీరంతా ఒక దగ్గర చేరి కుంటలాగా ఏర్పడింది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు నిలయంగా మారి రోగాల బారిన పడుతున్నాం. సమస్యలు పరిష్కరించాలి.

–గట్టు రాజు, ఆలేరు

ఎంపిక చేసి ఏడాది గడిచింది



మాకు లాటరీ పద్ధతి ద్వారా డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు వచ్చింది. మార్చి 29 తేదీ నాటికి సంవత్సరం అయిపోయింది. ఇప్పటి వరకు ఇల్లు కేటాయించలేదు. ఇళ్ల వద్ద వసతులు కూడా లేవు. ఇళ్లు కేటాయిస్తే స్వయంగా ఖర్చులు భరించి సౌకర్యాలు సమకూర్చుకుంటాం. ప్రస్తుతం కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ఎమ్మెల్యేను కలిసినా ఫలితం లేకుండాపోయింది.

–ఆరె సునీల్‌కుమార్‌, భువనగిరి

న్యూస్‌రీల్‌

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా అన్ని పీఏసీఎస్‌లలో సబ్సిడీపై ఇచ్చేందుకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు వేసే రైతులు పూత దశలో పొలంలో కలియదున్నాలని, ఇది ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువుతో సమానం అన్నారు. జీలుగ ద్వారా అనే ప్రయోజనాలు ఉంటాయని, వరి సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండలాలకు పాఠ్య పుస్తకాల తరలింపు



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ

భువనగిరి : పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం భువనగిరిలోని గోదాం నుంచి మండలాలకు పాఠ్యపుస్తకాలు తరలించే వాహనాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాకు 1,53,655 పుస్తకాలు, 70 టైటిల్స్‌ వచ్చాయన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి 100 శాతం పుస్తకాలు వస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠ్యపుస్తకాల మేనేజర్‌ రంగరాజన్‌, ఉపాధ్యాయులు బుస్సా రమేష్‌, ఆనందరావు, అంజన్‌కుమార్‌,అంబిదాస్‌, రామకృష్ణ పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అలాగే ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వేళ స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ, శివ సాయి ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ కట్టా మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి విడత అడ్మిషన్ల కోసం జూన్‌ 10వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్‌ నంబర్‌ 9848571409ను సంప్రదించాలని కోరారు.

పచ్చడి మామిడి పిరం



భువనగిరిలో పచ్చడి మామిడి విక్రయాలు

భువనగిరి : మామిడి కాయల పచ్చడికి సీజన్‌ వచ్చింది. దీంతో భువనగిరి పట్టణంలో రెండుమూడు రోజుల నుంచి పచ్చడి కాయలు పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. పచ్చడి కోసం జనం మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈసారి మామిడి ధర వింటేనే హడలెత్తిపోతున్నారు. సైజును బట్టి ఒక్కో కాయ రూ.10నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరల వల్ల 50, 100 కాయలకు బదులు 15 నుంచి 20 కాయలు మాత్రమే కొనుగోలు చేసి పచ్చళ్లు పెడుతున్నారు. ఈసారి మామిడి తోటలు పూత బాగానే వచ్చినప్పటికీ వాతావరణంలో మార్పుల వల్ల నిలబడలేదు. దీంతో దిగుబడిపై తక్కువగా రావడంతో పచ్చడి కాయల ధరలు పెరిగాయి.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాలు
- సెమిస్టర్‌ 36,392, బ్యాక్‌లాగ్‌ 18,052 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నిర్ణీత సమయానికి హాజరు కావాలి

డిగ్రీ 2,4,6 సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్‌ 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే విద్యార్థులు కళాశాలల నుంచి హాల్‌ టికెట్‌లు పొందారు. పరీక్షలకు నిర్ణీత సమయానికి హాజరుకావాలి.

–ఉపేందర్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి, ఎంజీయూ

భువనగిరి : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం నుంచి సెమిస్టర్‌ 2,4,6 రెగ్యూలర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు యూనివర్సిటీ పరిధిలో 45 కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఉదయం జరిగే సెమిస్టర్‌ పరీక్షలకు 36,392 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో 2వ సెమిస్టర్‌లో 12,525, 4వ సెమిస్టర్‌లో 12,313, 6వ సెమిస్టర్‌లో 11,554 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మధ్యాహ్నం జరిగే బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 18,052 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ఫస్ట్‌ సెమిస్టర్‌లో 6,923, 3వ సెమిస్టర్‌లో 6,050, 5వ సెమిస్టర్‌లో 5,079 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలు ఇలా..

యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 75 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ 11, ఎయిడెడ్‌ 2. ప్రైవేట్‌ కాలేజీలు 62 ఉన్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 2,4,6 సెమిస్టర్‌ రెగ్యూలర్‌ పరీక్షలు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు 1,3,5 బ్యాక్‌లాగ్‌ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, సిట్టింగ్‌ స్క్వాడ్‌ బృందాలను నియమించినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

'రావి' జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి




సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు, ఎమ్మెల్యే

భువనగిరి రూరల్‌ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరుతూ రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 18న జరిగే క్యాబినెట్‌ సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. అలాగే రాయగిరిలో నిర్మిస్తున్న క్రీడాప్రాంగణానికి, భువనగిరి మండలానికి రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆ మహనీయుని పేరున విశ్వవిద్యాలయాల్లో అవార్డు ప్రదానం చేయాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని పేర్కొన్నారు. రావి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా జూన్‌ 4వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్‌ బండ్‌పై, భువనగిరిలో, బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చెరుపల్లి శ్రీనివాసులు, రావి సుఖేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవ చేసే అవకాశం కల్పించాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



యాదాద్రిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి

యాదగిరిగుట్ట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్‌, పైళ్ల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా యాదాద్రీశుడి ఆశీస్సులు తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, దేవుడి కృప, కటాక్షంతో సేవ చేస్తానన్నారు. యావత్‌ తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, మళ్లీ పచ్చని పంటలతో కళకళలాడాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్‌ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి పాపట్ల నరహరి, ఆలేరు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ గడ్డమీది రవీందర్‌గౌడ్‌, నాయకులు మిట్ట వెంకటయ్య, ముక్కెర్ల సతీష్‌యాదవ్‌, గునగంటి బాబురావుగౌడ్‌, మారెడ్డి కొండల్‌రెడ్డి ఉన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించొద్దు

నల్లగొండ క్రైం: వరంగల్‌- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతి పొందాలని కోరారు. అభ్యర్థులు వారి ప్రచారంలో కులం, మతం, ఎదుటి వ్యక్తులను దూషించడం, ప్రార్థనా స్థలాల్లో ప్రచారం వంటివి చేయకూడదని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దని, సోషల్‌ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్ట్‌లు పెట్టవద్దని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేయాల్సి వస్తే సీ–విజిల్‌ యాప్‌ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ తెలిపారు.

● మళ్లీ ముంచింది



గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి చౌటుప్పల్‌ వ్యవసాయ మార్కెట్‌ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యాన్ని దగ్గరకు చేర్చుతున్న రైతు

ధాన్యం దిగుమతిలో జాప్యం చేయొద్దు

- అదనపు కలెక్టర్‌ బెన్‌షాలోమ్‌



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ బెన్‌షాలోమ్‌

సాక్షి, యాదాద్రి : కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు అన్‌లోడ్‌ చేయాలని అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) బెన్‌షాలోమ్‌ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో రైస్‌ మిల్లుల ప్రతినిధులతో సమావేశమై ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. మిల్లులకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా మిల్లుల్లో స్థలాభావం లేకుండా చూసుకొని ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.524 కోట్లు విలువ చేసే 2.39 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సివిల్‌ సప్లై జిల్లా మేనేజర్‌ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రైస్‌ మిల్లుల అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



రామన్నపేటలో రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

రామన్నపేట : ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ గురువారం రామన్నపేటలో చిట్యాల– భువనగిరి రహదారిపై రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని, అకాల వర్షాలకు వడ్లు తడిసి నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఓట్లు కొనుగోలు చేసిన నాయకులకు ధాన్యం విషయాన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి రవీందర్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటేశం, కన్నెబోయిన విజయభాస్కర్‌, కల్లూరి నాగేష్‌, గాదె నరేందర్‌, వనం ఉపేందర్‌, కందుల హన్మంత్‌, బావండ్లపల్లి బాలరాజు, బల్గూరి అంజయ్య, మేడబోయిన శ్రీనివాస్‌, వేముల సైదులు, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్‌ కోర్సులో శిక్షణ

- శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేత

సాక్షి మైత్రి మహిళ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి జూన్‌ 22 వ తేదీ వరకు బ్యూటీషియన్‌ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇస్తారు

శిక్షణలో నేర్పించే అంశాలు

త్రెడ్డింగ్‌, వ్యాక్స్‌, పెడిక్యూర్‌, మెనిక్యూర్‌, బ్లీచింగ్‌, స్కిన్‌కేర్‌, హెయిర్‌ కేర్‌, వైట్నింగ్‌ ఫేస్‌ ప్యాక్స్‌, డ్యాండ్రఫ్‌ ట్రీట్‌మెంట్‌, హెయిర్‌ ఫాల్‌ ట్రీట్‌మెంట్‌, హెయిర్‌ కట్స్‌, హెయిర్‌ స్టైల్స్‌, హెన్నా ప్రిపరేషన్‌, డై అప్లికేషన్‌, మేకప్స్‌ (బ్రైడల్‌, పార్టీ, లైట్‌ మేకప్స్‌), హెయిర్‌ మసాజ్‌, కమ్యూనికేషన్‌ అండ్‌ గ్రూమింగ్‌, ఫేషియల్స్‌

రిజిస్ట్రేషన్‌ స్వీకరించు తేదీలు :

ఈ నెల 17వ తేదీ (నేటి) నుంచి 22వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు.

ఫీజు : రూ.3 వేలు

వర్క్‌షాప్‌ షెడ్యూల్‌ తేదీలు: ఈ నెల 23వ తేదీ నుంచి జూన్‌ 22వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ ఉంటుంది.

రిజిస్ట్రేషన్స్‌, శిక్షణ స్థలం

సాహితీ బ్యూటీ పార్లర్‌ అండ్‌ ట్రైనింగ్‌ సెంటర్‌,
ఏకలవ్య స్కూల్‌ రోడ్‌,
శివాజీ నగర్‌, నల్లగొండ
సెల్‌: 96660 13544,
80747 42864

డెంగీ నిర్మూలనలో భాగస్వాములు కావాలి



భువనగిరిలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

- డీఎంహెచ్‌ఓ పాపారావు

భువనగిరి : డెంగీ నివారణకు చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌ఓ పాపారావు పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి ఫ్రైడే డ్రై డేగా పాటించాలని సూచించారు. ఇళ్ల కిటికీలు, గుమ్మాలు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని, దోమతెరలను వాడాలని పేర్కొన్నారు. పందులు, బాతులు నివాసాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి డెంగీ బాధితులను గుర్తించి చికిత్స అందించాలని కోరారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉంటే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్‌ రామకృష్ణ, సుమన్‌ కళ్యాణ్‌, డాక్టర్‌ వంశీకృష్ణ, డెమో మధుసూదన్‌రెడ్డి, ఏఎంఓ మధుసూదన్‌రావు, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ సాయిరెడ్డి, సీహెచ్‌ఓ నగేష్‌, ఎల్‌టీ ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


అశోక్ (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. వివరాలు.. సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త బెలిదె అశోక్(65) ఏప్రిల్ 27న పుట్టపాక నుంచి జనగాంకు బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి తలకు బలమైన గాయం కావడంతో గత 18రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. గురువారం అశోక్ భౌతికకాయానికి పలువురు వ్యాపారవేత్తలు, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి


గాయపడిన శ్రీనివాస్

చౌటుప్పల్: పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. వివరాలు.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బీసీకాలనీకి చెందిన పల్చం శ్రీనివాస్ వ్యాపారం చేస్తూ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాడు. తన అన్న పల్చం సత్యంతో కలిసి ఆయన 10వ వార్డు పార్టీ బాధ్యతలు చూసేవారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి కొంతమంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో వార్డు బాధ్యతలు వీరికి కాకుండా కొత్తగా పార్టీలో చేరిన వారికి అప్పగించారు. దీంతో అన్నదమ్ములు ఇద్దరూ అసంతృప్తితో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా చౌటుప్పల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ వద్ద పార్టీ మున్సిపాలిటీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు బాలు మహేందర్‌ను ఇదే విషయమై వారు నిలదీశారు. దీంతో మాటామాటా పెరగడంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఇతర నాయకులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. గురువారం సాయంత్రం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ వద్ద శ్రీనివాస్ టీ తాగుతుండగా.. నంబర్ ప్లేట్ లేని ఓ స్కార్పియో వాహనం వచ్చింది. అందులో నుంచి ఐదారుగురు వ్యక్తులు బయటకు దిగి పక్కనే ఉన్న రాళ్లను తీసుకొని శ్రీనివాస్‌పై దాడి చేసి పారిపోయారు. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా తనపై బాలు మహేందర్ దాడి చేయించాడని శ్రీనివాస్ ఆరోపించారు. బాలు మహేందర్‌తో పాటు ఎమ్మెల్యేతో కూడా తనకు ప్రాణహాని ఉందని అన్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీనివాస్‌ను హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

హాలియా: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హాలియా పట్టణంలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులంతా అండగా నిలవాలని కోరారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు ఎలాగైతే పనిచేశారో తీన్మార్ మల్లన్న విజయం కోసం అదేవిధంగా కృషి చేయాలన్నారు. ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్ధేశం చేశారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టే తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి, పక్కన తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

ప్రశ్నించే గొంతును గెలిపించండి..

ప్రశ్నించే గొంతుకగా ఉన్న తనను గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోరారు. తాను ఎప్పటి నుంచో ప్రజల పక్షాన పోరాడుతున్నానని, మాజీ సీఎం కేసీఆర్ వందల కేసులు పెట్టించినా భయపడలేదన్నారు. ప్రజలంతా ఏకం కావడంతో ఒక నియంతను గద్దెదించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆనాడు తాను ప్రజల కోసం కేసీఆర్‌ను ప్రశ్నించడం వల్లే అక్రమ కేసులు పెట్టించారని గుర్తుచేశారు. జీఓ 317 ద్వారా ఉద్యోగులకు ఇబ్బందులు కలిగాయని వాటిని సరిచేస్తామన్నారు. జీఓ 46 ద్వారా నిరుద్యోగ చావులకు కారణమైన బీఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి చెబుతామన్నారు. కేటీఆర్ తనను ఓడించాలని అష్టకష్టాలు పడుతున్నాడని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, అనుముల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు యడవెల్లి రంగసాయిరెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, మేరెడ్డి వెంకటరాహుల్‌రెడ్డి, రావుల చినభిక్షం, శంకర్‌నాయక్, హాలియా, నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్స్ యడవెల్లి అనుపమ, అన్నపూర్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, జెడ్పీటీసీలు అబ్బిడి కృష్ణారెడ్డి, రామేశ్వరీ, భారతి, ఎంపీపీలు ఆంగోతు భగవాన్ నాయక్, అనుముల పాండమ్మ ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకకు ఓటేయాలి

- మాజీ మంత్రి ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ప్రశ్నించే గొంతుక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే విద్యార్థుల సమస్యలపై పోరాడిన చరిత్ర ప్రేమేందర్‌రెడ్డిదని అన్నారు. ప్రజల పక్షాన 40 సంవత్సరాలుగా పోరాడుతున్నారని తెలిపారు. పట్టభద్రుల ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ప్రైవేట్ టీచర్లు, మేధావులు, నిరుద్యోగులు, యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరిస్తామన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ హవా ఉందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యువత వెన్నుదన్నుగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే చట్టసభలలో ప్రతిపక్షం బలంగా ఉండాలన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారని, బీఆర్‌ఎస్‌లో గెలిచిన వాళ్లే పార్టీ మారుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే యువత, ప్రజల పక్షాన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట్ నారాయణరెడ్డి, పోతెపాక సాంబయ్య, కంకణాల నివేదిత తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ లైన్‌మన్

- విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు లంచం డిమాండ్
- రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడ్డ వైనం


పట్టుబడిన లైన్‌మన్ వేణు

చింతపల్లి: విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు రైతు వద్ద నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ విద్యుత్ లైన్‌మన్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్ తెలిపిన ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద బోరుతో పాటు ఇంటి వద్ద విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని 2022లో దరఖాస్తు చేసుకున్నాడు. కాలయాపన చేస్తూ వచ్చిన విద్యుత్ లైన్‌మన్ నడింపల్లి వేణుకుమార్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు రూ.50వేలు లంచం డిమాండ్ చేశాడు. మొదటి విడతగా రూ.20వేలు, పని పూర్తిచేసిన తర్వాత మిగిలిన రూ.30వేలు ఇచ్చేలా అంగీకారం కుదిరింది. ఈ తరుణంలోనే రెండేళ్లుగా లైన్‌మన్ చుట్టూ తిరిగిన ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం మధ్యాహ్నం చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం వద్ద రైతు నుంచి రూ.20వేలు లంచంగా తీసుకుంటుండగా విద్యుత్ లైన్‌మన్ నడింపల్లి వేణుకుమార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం వేణును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

డెనాలి పర్వతారోహణకు అన్వితారెడ్డి

- నేడు హైదరాబాద్ నుంచి ప్రయాణం

భువనగిరి: భువనగిరికి చెందిన పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి అమెరికాలోని డెనాలి పర్వతాన్ని అధిరోహించేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం ఆమె హైదరాబాద్ నుంచి బయలుదేరనుంది. అన్వితారెడ్డి ఇప్పటికే నాలుగు ఖండాల్లోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించింది. ఇందులో ఆసియాలో ఎవరెస్టు, దక్షిణాఫ్రికాలో కిలిమంజారో, యూరప్‌లో ఎల్‌బ్రోస్, అంటార్కిటికా ఖండంలో విల్సన్ పర్వతాలు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా ఖండంలోని 6,105 అడుగుల ఎత్తులో ఉన్న డెనాలి పర్వతాన్ని అధిరోహించనుంది. ఈ నెల 20వ తేదీ నుంచి డెనాలి పర్వతాన్ని అధిరోహించడం ప్రారంభించి జూన్ 4 నుంచి 8వ తేదీ మధ్యలో పూర్తి చేసే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం వస్తుంది

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- యాదాద్రిలో ప్రత్యేక పూజలు


ఆలయంలో సుదర్శన నారసింహ హోమంలో పాల్గొన్న తన్నీరు హరీశ్‌రావు

యాదగిరిగుట్ట: బీఆర్‌ఎస్ పార్టీకి మళ్లీ పూర్వవైభవం వస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం రాత్రి యాదాద్రి స్వామి సన్నిధిలో ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్‌లో నిద్ర చేసిన ఆయన గురువారం ఉదయం 7.30గంటలకు యాదాద్రీశుడి ఆలయంలో నిర్వహించే శ్రీసుదర్శన నారసింహ హోమంలో పాల్గొన్నారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న అనంతరం వేంచేపు మండపం నుంచి కనిపించిన బస్వాపూర్ నృసింహ సాగర్ రిజర్వాయర్‌ను చూసి, పలు అంశాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరంగల్– నల్లగొండ– ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అంతకు ముందు హరీశ్‌రావును బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, కోశాధికారి మారెడ్డి కొండల్‌రెడ్డి, గునగంటి బాబురావుగౌడ్‌తదితరులు ఆలయ సన్నిధిలో సన్మానించారు.

పోలీసుల నిర్లక్ష్యంపై ఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ క్రైం: తనపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు ఎల్లపురెడ్డి సైదిరెడ్డి, మరికొందరు గురువారం జిల్లా ఎస్పీ చందనాదీప్తికి ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజు బూత్ సందర్శనకు వెళ్లి వస్తుండగా గుండు నాగరాజు, నరేందర్‌రెడ్డి, మరికొంత మంది వ్యక్తులు తన బైక్‌కు అడ్డం వచ్చారని ఎల్లపురెడ్డి సైదిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. బైక్ తాళంచెవి, సెల్‌ఫోన్‌ను లాక్కొని అసభ్యంగా తిట్టారని, చెప్పు తీసి దాడి చేశారన్నారు. ఈ ఘటనపై తాను నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మూడు రోజులవుతున్నా పోలీసులు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోగా మమ్మల్ని బెదిరించి కేసు విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారితో తనకు ప్రాణభయం ఉందని తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నల్లగొండ క్రైం: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలోని కేశరాజుపల్లి వద్ద గురువారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన సతీష్‌చారి(35), ఉమారాణి భార్యాభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. బుధవారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సతీష్‌చారి తిరిగిరాలేదు. గురువారం ఉదయం కేశరాజుపల్లి సమీపంలో రైలు పట్టాలపై విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతుడి భార్యకి సమాచారం ఇవ్వగా ఆమె సతీష్‌చారి మృతదేహాన్ని గుర్తించింది. అనారోగ్యం కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భువనగిరిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం


వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి

భువనగిరి: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గురువారం భువనగిరి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెద్ద చెరువు వద్ద వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం జీనియస్ పాఠశాలలో ఉపాధ్యాయులు, ఓటర్లను కలిశారు. కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నేత మృతి


క్రాంతికుమార్‌రెడ్డి (ఫైల్)

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సోషల్ మీడియా కోకన్వీనర్ కొప్పుల క్రాంతికుమార్‌రెడ్డి(28) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్)కు చెందిన కొప్పుల క్రాంతికుమార్‌రెడ్డి బైక్‌పై కుడకుడ రోడ్డు నుంచి సూర్యాపేట పట్టణంలో తాను నివాసముండే ఇంటికి వెళ్తుండగా.. కొత్తబస్టాండ్ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు క్రాంతి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయలపాలైన క్రాంతికుమార్‌రెడ్డిని స్థానికులు వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. క్రాంతిరెడ్డి తండ్రి నర్సిరెడ్డి ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు..

ఆత్మకూర్ (ఎస్) : కొప్పుల క్రాంతికుమార్‌రెడ్డి అంత్యక్రియలు గురువారం ఆత్మకూరు(ఎస్)మండల కేంద్రంలో ముగిశాయి. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు, నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వరుణ్‌రావు తదితరులు క్రాంతిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

నిజాయితీ చాటుకున్న ఎస్పీఎఫ్ పోలీసులు


సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు తమ నిజాయితీ చాటుకున్నారు. హైదరాబాద్‌లోని బర్కత్‌పురాకు చెందిన కె. అభిలాష్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో గురువారం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. అభిలాష్ కొండపైన కారు పార్కింగ్ చేసినప్పటికీ కారు అద్దాలు కిందకు ఉంచే ఆలయం లోపలికి వెళ్లాడు. కారులో విలువైన ఐడీ కార్డ్స్, నాలుగు మొబైల్స్ వదిలి వెళ్లారు. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ యుగంధర్, హోంగార్డు రవి కారు విండో తీసి ఉందని గమనించి సమాచార కేంద్రంలో అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తులను రప్పించి వారి వస్తువులు వారికి అప్పజెప్పి నిజాయితీ చాటుకున్నారు.

పథకం ప్రకారమే హత్య

- ఆంగోతుతండా హత్య కేసును ఛేదించిన పోలీసులు

కొండమల్లేపల్లి: మండలంలోని ఆంగోతుతండాలో ఈ నెల 8న జగ్రు అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చారు. పథకం ప్రకారమే ఈ హత్య చేసినట్లు పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం దేవరకొండ డీఎస్పీ గిరిబాబు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంగోతుతండాకు చెందిన జగ్రు కొన్నినెలల క్రితం గ్రామంలో జరిగిన ఓ శుభకార్యంలో తనకు వరుసకు సోదరుడి కుమారుడు అయిన ఆంగోతు బాలును చిన్న తగాదా విషయంలో కొట్టాడు. అంతేకాకుండా ఇరు కుటుంబాల మధ్య భూమి గెట్టు వివాదం ఉంది. ఈ నేపథ్యంలో జగ్రును హతమార్చాలని నిర్ణయించుకున్న బాలు తన బాబాయి కుమారుడైన తేజ సహాయం కోరాడు. ఈ క్రమంలోనే సంతలో రెండు గొడ్డళ్లను కొనుగోలు చేశారు. ఈ నెల 8న ఆంగోతుతండాలో ఇంటి బయట నిద్రిస్తున్న జగ్రుపై బాలు, తేజ గొడ్డళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో జగ్రు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య నేతృత్వంలో కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ నర్సింహ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి కేసు విచారణ చేట్టారు. ఈ క్రమంలోనే బాలును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తేజ సహాయంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి పల్సర్ బైక్, సెల్‌ఫోన్, రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. తేజ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐలు రామ్మూర్తి, నర్సింహ, క్రైమ్ పార్టీ సిబ్బంది హేమునాయక్, భాస్కర్, సత్యనారాయణ, గురువారెడ్డి, రవి, సైదులును డీఎస్పీ అభినందించారు.

అమరుల ఆశయసాధనకు కృషిచేద్దాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


అంజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం తదితరులు

రామగిరి(నల్లగొండ): అమరుల ఆశయసాధనకు కృషిచేద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. గురువారం తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో నిర్వహించిన సీపీఎం సీనియర్ నాయకుడు నన్నూరి అంజిరెడ్డి సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దోపిడీ, అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడే వారే కమ్యూనిస్టులు అన్నారు. నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడిన అంజిరెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. రాజకీయాల్లోకి బడా కార్పొరేట్ కంపెనీల అధినేతలు చొరబడి కలుషితం చేశారని ఆరోపించారు. అంజిరెడ్డి పార్థివదేహాన్ని మెడికల్ కళాశాలకు అందజేయడం అభినందనీయమన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. నన్నూరి అంజిరెడ్డి తన ఇంటిని సీపీఎం కార్యాలయంగా మార్చుకుని పేదలకు ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండా శ్రీశైలం, సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, గంజి మురళీధర్, సత్తయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


నరేష్ (ఫైల్)

సూర్యాపేట: విద్యుదాఘాతంతో యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట మండలంలోని యండ్లపల్లి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యండ్లపల్లి గ్రామానికి చెందిన పత్తి నరేష్(35) గురువారం సాయంత్రం తన వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లి మోటర్ ఆన్ చేస్తుండగా... అప్పటికే వర్షానికి తడిసిన మోటర్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

భూదాన్‌పోచంపల్లి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ కృష్ణన్ అన్నారు. గురువారం పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న ధాన్యం కుప్పలు, ఏతలు సర్దిషై చేసిన ధాన్యం, అనాలిస్ రిపోర్టు, రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని, ఇంకా ఎంత ధాన్యం ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకొన్నారు. లారీల కొరత ఉందని, లారీలను పంపించాలని రైతులు కోరగా, రైస్‌మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో జాప్యం జరుగుతుందని, రోజురోజు లారీలను పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఏపీఎం నీరజ, పంచాయతీ కార్యదర్శి రజిత, ఈజీఎస్ టీఏ వినోద్ తదితరులు ఉన్నారు.

మండు వేసవిలోనూ మూసీ ప్రవాహం



వర్షాకాలంలో విస్తృతంగా వర్షాలు కురిసినప్పుడే మూసీనదిలో నీరు ప్రవహిస్తూ ఉండేది. కానీ ప్రస్తుతం మండు వేసవిలో సైతం మూసీలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన హైదరాబాద్ పట్టణంలోని వ్యర్థపు నీరు మూసీలోకి వచ్చి చేరుతుండడంతో ఆనకట్టల మీదుగా ఆ నీరు ప్రవహిస్తూ మూసీ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది.

– శాలిగౌరారం